www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 9 అక్టోబర్ 2025

5

తిరుపతి



జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేయండి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఎస్.ఆర్. శంకరన్ జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యల పరిష్కారంలో భాగంగా బుధవారం అధికారులతో కలసి జర్నలిస్ట్ కాలనిలో పర్యటించారు. జర్నలిస్ట్ కాలనిలో నెలకొన్న సమస్యలను పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మోహన్, పాత్రికేయులు కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎస్.ఆర్. శంకరన్ జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించామని తెలిపారు. పెద్ద కాలువలో ఎక్కువ చెత్త నిలిచిపోవడం వలన ఇబ్బందిగా ఉందని ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి మూర్తి, డి.ఈలు రమణ, శిల్ప ,శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

కమిషనర్‌కు అభినందన



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కేటగిరిలో స్వచ్ఛాంద్ర అవార్డును అందుకున్న తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యను డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్.కె.బాబు, నరసింహ ఆచారి, అనిల్ కుమార్‌లు అభినందించారు.

డప్పు కళాకారుల సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక



ప్రజాశక్తి - రేణిగుంట: ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం, రేణిగుంట మండల మహాసభ సందర్భంగా నూతన మండల కమిటీని 15 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య బుధవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా కొండ్రెడ్డి హరినాథ్, అధ్యక్షుడిగా ఎన్.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా వై.గంగాధరం, ఉపాధ్యక్షులుగా ఎం.చంద్రయ్య, సి.సుబ్రహ్మణ్యం, జి. పురుషోత్తం, సహాయ కార్యదర్శులుగా ఏ.విద్యాసాగర్, పి.మణి, కోశాధికారిగా ఎం.చాలెంజి కమిటీ సభ్యులుగా రేణయ్య (సుబ్బయ్య గుంట), బాబు(కుమ్మరపల్లి), చీరాలయ్య (%ాఖ% పురం), ప్రహల్లాద (వెధల్ల చెరువు), వెంకటరమణ (వెంకటాపురం), సిద్దయ్య (ఎలమంద్యం) ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రేణిగుంట మండలం డప్పు కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ.. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ద్వారా డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు, 2ఎకరాలు వ్యవసాయ పొలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బస్సు, రైలులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. పెన్షన్ 4వేలు నుంచి 7వేలు రూ. పెంచి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డప్పు కళాకారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, సహజ మరణానికి 5 లక్షలు ఇవ్వాలని ప్రతి డప్పు కళాకారునికి ప్రభుత్వం ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పోరాడి సాధించుకుంటామని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలి

ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం, ఐద్వా డిమాండ్!

ప్రజాశక్తి - రేణిగుంట: చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, దేవలంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనను ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం, ఐద్వా మహిళా సంఘ సభ్యులు తీవ్రంగా ఖండించారు. బుధవారం రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో డప్పు దరువులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. డప్పు కళాకారుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. అక్టోబర్ 2 తేదీ అర్ధరాత్రి దేవళంపేటలో రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి కట్టెలు పేర్చి పెట్రోల్ పోసి నిప్పు అంటించిన కుట్ర దారులు, దోషులను గుర్తించి వారిపై ఎస్సీబి ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య, రేణిగుంట మండల గౌరవ అధ్యక్షుడు కొండ్రెడ్డి హరినాథ్ కలిసి ఈ సందర్భంగా తెలుగుదేశం కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఐద్వా తిరుపతి జిల్లా అధ్యక్షురాలు కె .ఈశ్వరమ్మ, రేణిగుంట మహిళా సంఘం మండల అధ్యక్షురాలు భారతి, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వెంకటరమణ, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి కుప్పస్వామి, డప్పు కళాకారులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇండియా రోడ్ అహెడ్‌పై చర్చ



మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు, ఐఐటి లో బుధవారం ఇండియా రోడ్ అహెడ్ అనే అంశంపై ముఖ్య అతిథిగా పాల్గొన్న లోక్ సత్తా ఉద్యమ వ్యవస్థాపకుడు, ప్రముఖ ప్రజా విధాన నిపుణుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ ప్రసంగించారు. భారతదేశ భవిష్యత్తును రూపొందించడంలో సమర్థవంతమైన పాలన యొక్క కీలక పాత్రను తెలియచేశారు. ప్రభుత్వం క్రమశిక్షణ, చట్ట పాలనను నిర్వహించడం, విద్య, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు వంటి సామాజిక అవసరాలను తీర్చడానికి ఎందుకు అవసరమో వివరించారు. ఆర్థిక పురోగతి సామాజిక శ్రేయస్సుగా మారేలా చూసుకోవడానికి వ్యవస్థాగత విధాన జోక్యాలు, సంస్థాగత సంస్కరణలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రసంగంలో ఐఐటి డైరెక్టర్, ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ. 2.18 కోట్లు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామీ అమ్మవార్లకు, పరివార దేవతలకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం 2 కొట్లా 18 లక్షలా 65 వేలా 233 రూపాయలు వచ్చింది. స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ లెక్కింపులు జరిగాయి. బంగారం 134 గ్రాములు, వెండి 680 కిలోలు, 151 విదేశీ నోట్లు వచ్చినట్లు ఏఈవో మోహన్ తెలిపారు.

మోహన్ బాబు యూనివర్సిటీని రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: గత 3 సంవత్సరాల నుండి మోహన్ బాబు విద్యా సంస్థల్లో ఫీజుల అక్రమ ఫీజు వసూళ్లపై తల్లితండ్రులు, విద్యార్థి సంఘాలు పిర్యాదు చేస్తున్న వాటిపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం చేతనే ఎంబియూ అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్ విమర్శించారు. ఉన్నత విద్యా మండలి, ఫీజు రెగ్యులేషన్ కమిటీ మోహన్ బాబు యూనివర్సిటీలో ఫీజుల అక్రమాలపై నిగ్గు తేల్చిన సమగ్ర రిపోర్ట్‌ను భారత విద్యార్థి ఫెడరేషన్, అన్ని విద్యార్థి సంఘాలు, తల్లితండ్రులు స్వాగతిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల పక్షం వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని, ఎంబీయును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ మోహన్ బాబు యూనివర్సిటీలో అక్రమాలు బయటకి రాకుండ బౌన్సర్‌ను అడ్డుపెట్టుకొని విద్యార్థులను ఇబ్బంది పెడుతుందని, విద్యార్థికి ఇష్టం లేకుంటే బలవంతంగా హాస్టల్ ఫీజులు కట్టల్సిందే అంటూ లక్షల రూపాయలు ఒక్కో విద్యార్థి నుంచి ముక్కు పిండి వసూలు చేసిందని, అలా అక్రమాల ద్వారానే కోట్ల రూపాయలు వసూల్ చేసిందని, ఆ ఫీజులు అన్నిటిని విద్యార్థులకు తిరిగి తక్షణమే చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతూ విద్యాను వ్యాపారం అడ్డగా మార్చిన మోహన్ బాబు యూనివర్సిటీ నైతిక హక్కు కోల్పోయిందని, తక్షణమే యూనివర్సిటీ హోదా రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐజిల్లా అధ్యక్షులు అక్బర్, నగర కార్యదర్శి తేజ పాల్గొన్నారు.

మోహన్ బాబు వర్సిటీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు చేపట్టాలి : సిఐటియు

విద్యార్థుల నుంచి అక్రమంగా 26 కోట్ల రూపాయల ఫీజులను అదనంగా వసూలు చేసిన మోహన్ బాబు వర్సిటీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే ఎంబీయూ ఎక్కువగా వసూలు చేసిందని ఆడిట్ నివేదికల్లో రుజువైన విషయాన్ని వెల్లడి చేశారు. విద్యార్థులకు, ఫ్యాకల్టీకి ఒరిజినల్ సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా వేధించటం, యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వీరికి ఓ ధోరణిగా మారిందని తెలిపారు. ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడడం, బెదిరింపులకు పూనుకోవడం గతం నుంచి వీరికి ఉన్న రివాజని ఆయన గుర్తు చేశారు. మోహన్ బాబు వర్సిటీలో జరిగిన ఉల్లంఘనలను, అక్రమాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ గుర్తించిందని... ఆఖరుకు విద్యార్థుల హాజరు నమోదులోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. విద్యార్థులు తరగతులకు హాజరైనా కానట్లు చూపించి రూ.7500ల చొప్పున అదనంగా వసూలు చేశారని... ఉన్నత విద్యా కమిషన్‌కు సరైన సమాచారం ఇవ్వడం లేదని, వసూలు చేసిన ఫీజుల సమాచారాన్ని కమిషన్‌కు వెల్లడించలేదని కమిటీ తెలిపిన అంశాల్ని గుర్తు చేశారు. బీటెక్ విద్యార్థుల నుంచి రూ.5000ల నుంచి రూ.45000లు అదనంగా వసూలు చేయడం డిగ్రీ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంఏ విద్యార్థుల నుంచి రూ.18000ల నుంచి రూ.25 వేల రూపాయలు అదనంగా వసూలు చేయటం, బీఫార్మసీ ఫార్మా డి విద్యార్థుల నుంచి 25 వేల నుంచి 40 వేల రూపాయలు, బీఎస్సీ ఆనర్స్, అగ్రికల్చర్ విద్యార్థుల నుంచి రూ.22,000 నుంచి రూ.33,000 పారా మెడికల్, హెల్త్ కేర్ సైన్సెస్ విద్యార్థుల నుంచి రూ.40 వేల నుంచి రూ.45000లు అదనంగా వసూలు చేశారని 2023లో 2 కోట్ల 59 లక్షలు, 24 లో 10 కోట్ల 65 లక్షలు, 25 లో 12 కోట్ల 93 లక్షలు మొత్తం 26 కోట్లకు పైగా అదనంగా వసూలు చేయడమే కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు స్వచ్ఛందంగా అధిక ఫీజులు చెల్లించారని అడ్డగోలు వాదనలు చేస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాజకీయ వత్తిడులకు తలొగ్గకుండా ఈ చర్యలు ఉండాలని, భవిష్యత్తులో మరే ప్రైవేటు యాజమాన్యం తప్పులు చేయకుండా ఉండేటట్లుగా వ్యవహరించాలని ఆయన సూచించారు. అదనంగా వసూలు చేసిన ఫీజులను విద్యార్థులకు తిరిగి వెనక్కు ఇచ్చి వేయాలని కందారపు మురళి ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.




ఆరోపణలు దురదృష్టకరం : వైస్ ఛాన్సలర్ మంచు విష్ణు



ప్రజాశక్తి - చంద్రగిరి: మోహన్ బాబు విశ్వవిద్యాలయానికి వ్యతిరేకంగా ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చేసిన కొన్ని సిఫార్సుల గురించి వివిధ మీడియా మాధ్యమాలలో ప్రచారమవుతున్న వార్తలను ఉద్దేశించి యూనివర్శిటీ ప్రో-ఛాన్సలర్ మంచు విష్ణు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషన్ చేసిన సిఫార్సులను ఎంబియు ఖండిస్తోందని తెలిపారు. అవి కేవలం సిఫార్సులు మాత్రమేనని, ఆ సిఫార్సులు ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టులో విచారణలో ఉన్నాయని తెలిపారు. హైకోర్టు, సదరు సిఫార్సులపై 'స్టే' ఉత్తర్వును జారీ చేసిందని తెలిపారు. కానీ కోర్టు ఉత్తర్వును ధిక్కరించి పోర్టల్లో పెట్టడం దురదృష్టకరమన్నారు. విషయాన్ని తీవ్రతరం చేసి, విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను దిగజార్చడానికి ఉద్దేశపూర్వకంగా ఎంపిక చేసిన సమాచారాన్ని మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి నిరాధారమైన వార్తలను నమ్మవద్దని తల్లిదండ్రులకు, మీడియాకు, తమ భాగస్వాములందరికీ తెలియజేస్తున్నామన్నారు. ఎంతోమందికి ఉచిత విద్యను అందించడం, సాయుధ దళాలు, పోలీసు సిబ్బంది పిల్లలకు పూర్తి స్కాలర్షిప్పులు ఇవ్వడం, అనాథలను దత్తత తీసుకుని వారికి పూర్తి విద్య, సంరక్షణ అందించడం వంటివి మోహన్‌బాబు విద్యా సంస్థలు చేపడుతున్నట్లు తెలిపారు. కానీ కొందరు దురుద్దేశంతో తమను విమర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ ఉన్నత విశ్వ విద్యాలయాలతో తమకు ఒప్పందాలున్నాయని, ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన ఎంబియులో అందిస్తున్నట్లు తెలిపారు. విచారణ సమయంలో మోహన్ బాబు యూనివర్శిటీ బృందం మాకు పూర్తిగా సహకరించిందని అదే కమీషన్ తన నివేదికలో పేర్కొనడం ఎలాంటి తప్పు జరగలేదనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తోందని తెలిపారు. ఎంబియు ఛాన్సలర్ డాక్టర్ ఎమ్. మోహన్ బాబు మార్గదర్శకత్వంలో ప్రపంచ స్థాయి సమగ్ర విద్యను అందిస్తూ యువతను శక్తివంతం చేసే ప్రయత్నాన్ని కొనిసాగిస్తున్నామని తెలియజేశారు.

స్థానిక ఎన్నికలు నిర్వహించే దమ్ముందా..?

- కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం
- చంద్రబాబు మోసాన్ని ప్రజలు గ్రహించారు : నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి



ప్రజాశక్తి - వెంకటగిరి: స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబుకు ధైర్యం లేదని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలియజేశారు. బుధవారం స్థానిక నేదురుమల్లి నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ధైర్యం సీఎం చంద్రబాబుకు లేదని, నామినేటెడ్ పదవులతో కాలయాపన చేస్తారన్నారు. వెంకటగిరిలో నామినేటెడ్ పదవులు రేటు పెట్టి పలు పదవులను కట్టబెట్టారు.మూడన్నారేళ్లుగా ఖాళీగా ఉన్న వెంకటగిరి జెడ్పిటిసి పదవికి ఎన్నికలు నిర్వహించకుండా ఒంటిమిట్ట, పులివెందుల జడ్పిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం స్థానిక సంస్థల ఎన్నికలపై చంద్రబాబు వైఖరికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు.సీఎం చంద్రబాబు సహజ ధోరణి లో చేసిన మోసాన్ని రాష్ట్ర ప్రజలు తొందరగానే గ్రహించారని ఎన్నికలు ఎప్పుడు వస్తాయా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవాలని ఎదురు చూస్తున్నారన్నారు . కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం అయిందని, కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఏడు త్రై మాసికాలు కు సంబంధించిన ఫీజు రీయింబర్స్మెంట్ నిధుల ఉ సే లేదన్నారు. మహిళలకు ప్రతినెల రూ 1500, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 3000 హామీలు అమలు చేయకపోగా స్త్రీనిధి ద్వారా మహిళలకు, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నిరుద్యోగ యువతకు ఆ పథకాలు అమలు అయ్యాయని వాటి గురించి ఎవరు మాట్లాడేదానికి లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పడం సరికాదన్నారు

జగన్ 2.0 లో కార్యకర్తలకే ప్రాధాన్యం..


జగన్ 2.0 కార్యకర్తలు నాయకులకే ప్రాధాన్యత ఉంటుందని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చెప్పడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని నేదురుమల్లి తెలిపారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మందిలో వైఎస్సార్సీపీలో ఎంపిపి చేసిన 120 మంది స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన డాక్టర్ బోలిగల మస్తాన్ యాదవ్, కలిమిలి రాంప్రసాద్ రెడ్డి, పాపికన్ను మధుసూదన్ రెడ్డి లకు స్థానం తగ్గడం హర్షణీయమని తెలిపారు జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునే లక్ష్యంతో పనిచేయాలన్నారు.

కూటమి ప్రభుత్వంలో వైద్యం వదిలి మద్యం కు ప్రాధాన్యం..

వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ బోలిగల మస్తాన్ యాదవ్

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో వైద్యంను గ్రామస్థాయికి తీసుకువస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్యంను వదిలి మద్యం కు ప్రాధాన్యం ఇస్తూ ఇంటింటికి బెల్టు షాపు ద్వారా మద్యాన్ని చేరవేస్తుందని వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ బోలిగల మస్తాన్ యాదవ్ విమర్శించారు . బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పై విషప్రచారం అబద్ధపు హామీలతో గెద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం మద్యం వ్యవహారంతో గ్రామస్థాయిలో మహిళలనుఇబ్బందులకు గురి చేస్తున్నారని, 2027 లో రాబోవు జెమిని ఎన్నికల్లో టిడిపికి తగిన రీతిలో వారు బుద్ధి చెప్తారని తెలిపారు. అందరి సహకారంతో పార్టీ పార్టీష్టతకు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వెంకటగిరి డక్కలి బాలాయపల్లి మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతిలో జాతీయ స్థాయి సహకార వర్క్ షాప్



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: భారత ప్రభుత్వం సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖతో కలిసి, "సహకార రంగం అభివృద్ధి అండ్ డిజిటలైజేషన్, గ్రైన్ స్టోరేజ్, ఎం - పిఏసిఎస్ విస్తరణ, కోఆపరేటివ్ బ్యాంకింగ్ బలపరిచే దిశగా" అనే అంశంపై జాతీయ స్థాయి రెండు రోజుల వర్క్ షాప్ బుధవారం తిరుపతి తాజ్ హోటల్‌లో ప్రారంభ మైంది. ఈ సందర్భంగా రెండు రోజుల సదస్సును రాష్ట్ర సహకార కమీషనర్, సహకార సంఘా ల రిజిస్ట్రార్ బాబు, భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ అశీష్ కుమార్ భూటాని, అదనపు కార్య దర్శులు పంకజ్ కుమార్ బన్సాల్, రవీంద్ర కుమార్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు ఆనంద్ కుమార్ ఝా, రమణ్ కుమార్‌లతో కలసి జ్యోతి ప్రజ్వ లన చేశారు. డాక్టర్ అశీష్ కుమార్ భూటాని మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహిస్తున్న శ్రేణిలో ఐదవ వర్క్‌షాప్‌ను తిరుపతిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశంలోని అన్ని రాష్ట్రాల సహకార సంఘాల కార్యదర్శులు, రిజిస్ట్రార్లు, సహకార మంత్రిత్వశాఖ, నాబార్డ్, ఎన్‌సీడీసీ, ఇతర అగ్రశ్రేణి సంస్థల ప్రతినిధులు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, అడిషనల్ రిజిస్ట్రార్లు ఎన్.వి.ఆర్. ఆనందబాబు, గౌరీ శంకర్, జాయింట్ రిజిస్ట్రార్‌లు శ్రీలక్ష్మి, చిత్తూరు, డిసిఓలు లక్ష్మీ, నాగవర్ధన, అధికారులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని భారత రాజ్యాంగ పరిరక్షణ ఐక్య వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం గూడూరు టవర్ క్లాక్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు ఈ విషయమై వినతిపత్రం అందించారు. తమ వినతిని రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జోగి శివ కుమార్, ఎంబేటీ చంద్రయ్య, జీలానీ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఇంగిలాల భాస్కర్, పట్టణ కార్యదర్శి ఎండి. గౌస్ బాషా, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ యునైటెడ్ ఫోరమ్ జాతీయ ఉపాధ్యక్షులు వేగూరు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో జోరు వాన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో బుధవారం జోరుగా వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయామయ్యాయి. ఉదయం ఎండ కాయడంతో ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఇళ్ల నుంచి బయటకొచ్చారు. ఒక్కసారిగా మెరుపులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. గంటపాటు వర్షం కురవడంతో చాలా చోట్ల రోడ్డుపై నీరు నిలిచింది.

ప్రైవేటుకు తిరుపతి రైల్వే స్టేషన్

దక్షిణ వైపు కొత్త భవనంపై ఎయిర్ స్పేస్ లీజు కోసం ప్రీ-బిడ్ సమావేశం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి రైల్వే స్టేషన్ ప్రైవేటీకరణ వైపు అడుగులు వేస్తున్నారు. దక్షిణం వైపు కొత్త భవనం నిర్మాణం పనులు జరుగుతున్నాయి. అందులో కొన్ని అంతస్తులు ప్రైవేట్ పరం చేసేందుకు రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా బుధవారం కొత్త భవనం పై ఎయిర్ స్పేస్ లీజు కోసం ఫ్రీ బిడ్ సమావేశం నిర్వహించడం జరిగింది. తిరుపతి రైల్వే స్టేషన్‌కు ఏడాదికి సుమారు 170 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది. ప్రతిరోజు 80 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ప్రయాణికులు రోజుకి 50 నుంచి 60 వేల మంది ప్రయాణికులు ప్రయాణిస్తారు. ప్రస్తుతం సుమారు 400 కోట్ల రూపాయలతో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేస్తున్నారు. రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన స్వయంప్రతిపత్తి సంస్థ రైల్ ల్యాండ్ డెవలప్మెంట్ అథారిటీ, తిరుపతి రైల్వే స్టేషన్ కొత్త దక్షిణ వైపు భవనంపై ఉన్న 36,640 చ.మీ. ఎయిర్ స్పేస్ లీజు టెండర్ ప్రక్రియలో భాగంగా, ప్రీ-బిడ్ సమావేశాన్ని బుధవారం తిరుపతిలో నిర్వహించింది. కొత్త దక్షిణ వైపు స్టేషన్ భవనం 14 అంతస్తులతో రూపకల్పన చేయబడింది. అందులో 10 అంతస్తులు వాణిజ్య అభివృద్ధి కోసం - రిటైల్ షాపులు, రెస్టారెంట్లు, హోటళ్ళు మొదలైన వాటికి కేటాయించబడనున్నాయి. ఈ లీజు రెవిన్యూ షేర్ మోడల్ పద్ధతిలో అందించనున్నారు. ఈ సమావేశానికి అనేక రియల్ ఎస్టేట్ డెవలపర్లు, హాస్పిటాలిటీ రంగానికి చెందిన ప్రతినిధులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలలో హాజరయ్యారు. ఈ సమావేశాన్న అధికారులు, కన్సల్టెంట్లు ఎర్నస్ట్ అండ్ యంగ్ అనారాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎల్‌డిఏ మనోజ్ గార్గ్, వైస్ ఛైర్మన్, (న్యూఢిల్లీ) తారుణ్ కుమార్ గోయల్, మెంబర్/ప్లానింగ్, (తిరుపతి) హాజరయ్యారు. సౌరభ్ రెవిన్యూ షేర్ మోడల్‌పై వివరణ ఇవ్వగా, రాహుల్ కపిల్ తిరుపతి ఎయిర్ స్పేస్ లీజ్ ప్రాజెక్ట్‌పై వివరాలు అందించారు. విష్ణు వర్ధనరావు, ఆర్ఎల్‌డిఏ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, సికింద్రాబాద్, పాల్గొన్న డెవలపర్లతో ముచ్చటించారు. ఇతర సికింద్రాబాద్ అధికారులలో శ్రీనివాసరావు (జాయింట్ జీఎం)షకీల్ అహ్మద్ (మేనేజర్) హాజరయ్యారు.

సమస్యలు పరిష్కరానికి వినతి



ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని విక్రమ్ సారాభాయ్ నగర్, అయ్యప్ప నగర్, ఉల్లా పడవ రోడ్డు, డొంక రోడ్డ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, డ్రైనేజీ, పరిశుభ్రత చాలా అధ్వాన స్థితిలో ఉన్నాయని, వర్షాల కారణంగా ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దోమలు విపరీతంగా ఉన్నాయని దీనివల్ల స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారని, మురుగు నీరు గుంటలు పందులకు ఆవాసాలవుతున్నాయని, శ్రీహరికోట రిటైర్డ్ ఎంప్లాయిస్ ప్రతినిధులు ఏకమై సమస్యలపై బుధవారం మునిసిపల్ కమిషనర్ చిన్నయ్యకి వినతి పత్రం సమర్పించారు. కమిషనర్ బడ్జెట్ వెసులుబాటు అనుసరించి పనులు చేపడతామని,ఈ సమస్యలపై అధికారులకు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. వీధి దీపాల సమస్య పై వెంటనే చర్య తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం రెడ్డి, శంకరయ్య, సాంబశివయ్య, మనోహర్, కృష్ణ, కనకరాజు, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు పంపిణీ కార్డులు జారీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, రైతు సేవ కేంద్రంలో ఎరువుల పంపిణీ నిమిత్తం కార్డులు జారీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి షణ్ముగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్డులు పొందేందుకు ఆధార్, పాస్‌బుక్ తీసుకురావాలని తెలిపారు. అధికారులు రైతుల భూమిని పరిశీలించి కార్డులు మంజూరు చేస్తారని తెలిపారు. రైతులకు ఎరువుల వాడకంపై వివిధ సూచనలు చేశారు.

సహకార సంఘం చైర్మన్‌గా వేంపల్లి భాస్కర్



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, గాజుల పెళ్లూరుకు చెందిన వేంపల్లి భాస్కర్ యాదవ్ కాటూరు సహకార సంఘం చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. టిడిపి అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ గాయత్రి విద్యార్థుల చేయూత



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఓం సాయిరాం వృద్ధాశ్రమానికి శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాల పదో తరగతి విద్యార్థులు, యాజమాన్యం ఫల సరుకులు అందించారు. స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల నాయకత్వ లక్షణాలు, సేవా భావం పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

శాస్త్రీయ ఆలోచనలకు విద్యార్థి దశ కీలకం

ప్రజాశక్తి - పాకాల: ఆంధ్రప్రదేశ్ భారతీయ విజ్ఞాన మండలివారు నవంబరు, డిసెంబర్ నెలల్లో నిర్వహించే "కౌశల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ -2025" పై అవగాహన కార్యక్రమాన్ని మోగరాల జడ్పీ హైస్కూల్ కౌశల్ సమన్వయకర్త వనపర్తి వెంకట సిద్దులు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు సుమలత తెలిపారు. ఈ సందర్భంగా సమన్వయకర్త వనపర్తి వెంకట సిద్దులు మాట్లాడుతూ "కౌశల్ టాలెంట్ టెస్ట్-2025" అనేది ఆంధ్రప్రదేశ్ భారతీయ విజ్ఞాన మండలిచే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8,9,10 తరగతుల గ్రామీణ విద్యార్థి యువత కోసం నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టాలెంట్ పరీక్ష అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ పోల్స్ మార్పిడి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, తడుకు పంచాయతీవడ్డ దారికి అడ్డుగా ఉన్న విద్యుత్ పోల్‌ను మార్చాలని తిరుపతి కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల వేదికలో కలెక్టర్‌కు గ్రామస్తులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ పోల్స్‌ను తొలగించి, రాక పోకలకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు.

సుశీలమ్మకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని పోడవరం పంచాయతీలో నివాసం ఉంటున్న టీడీపీ బూత్ ఇంచార్జ్ తాతయ్య మాతృమూర్తి సుశీలమ్మ అనారోగ్య కారణంతో బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి వారి గ్రామానికి వెళ్లి సుశీలమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని యూత్ హాస్టల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ విభాగం వారు సమాచార హక్కు చట్టం- 2005 పై మహిళలకు, రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం వివరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో తిరుపతి, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెం మండలాలకు చెందిన పలువురికి సిఎంఆర్ఎఫ్ సహాయనిధి ద్వారా సుమారు 26 లక్షల 29వేల 766 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. సిఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని లక్ష్మీపురం గిరిజన కాలనీ లో బుధవారం విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్, మేనేజర్ సుబ్రహ్మణ్యం, పాఠశాల ఉపాధ్యాయులు నాగరాజులు లక్ష్మీపురం, ఓటువాని చెరువు ఎస్టీ కాలనీల్లో పర్యటించి బడి ఈడు పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలకు పాఠశాలకు రాను,పోను ఆటో సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మొక్కుబడిగా చెరువు కట్ట పనులు.. పట్టించుకోని అధికారులు



ప్రజాశక్తి - బాలాయపల్లి : చెరువు కట్టల పటిష్టతకు, వరవ కాలువల అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేస్తున్న గ్రాంట్లు కాంట్రక్టర్లు, అధికారులు జేబులు నింపుకునేందుకు ఉపయోగపడుతున్నాయని మండల పరిధిలోని రైతులు ఆరోపించారు. మేల్పూరులో రెండు చెరువులు, ఆయా చెరువులకు వచ్చే వరవ కాలువల అభివృద్ధికి చాపగుంట, చావిటిగుంట చెరువుకు రూ. 20.50 లక్షలు, చిన్న చెరువుకు రూ.4.95 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులలతో ఆయా చెరువు కట్టలు పటిష్టంగా లేని చోట మట్టి తోలి పట్టిష్ట పరచడంతో పాటు చెరువులకు నీరు వచ్చే వరవ కాలువల్లో మొక్కలు తొలగించి, కాలువలు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. అయితే మేల్పూరు, చాపగుంట, చావిటిగుంట చెరువు కట్టను చదును చేసి నెరిపివేశారు. అంతే కాక, గత ఏడాది చెరువు కట్టకు గండి పడిన చోట కాంక్రీట్ వేసి కట్టను పటిష్ట పరచాల్సి ఉండగా, ఇసుక తేలేలా నాసిరకంగా కాంక్రీట్ వేసి వదిలేశారని స్థానిక రైతలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్గానికే చెరువు కట్ట నెర్రెలు బారిందని తెలిపారు. ఎవరైనా ప్రశ్నిస్తే, అదికారులే దగ్గరుండి పనులు చేయించారంటూ కాంట్రాక్టర్లు మాట దాటవేస్తున్నారు. చెరువు కట్టలను అభివృద్ధి చేసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలనే ప్రభుత్వ లక్ష్యం అదికారులు, కాంట్రక్టర్ల చేతివాటంతో నీరుగారుతుందని గ్రామస్తులు ఆరోపించారు. అందరికి కనిపించేలా కొంత మేర మట్టి తోలి నెరిపివేశారని ఇరవై లక్షలు పనికి గాను కనీసం రూ.10 లక్షలు కూడా ఖర్చు చేయలేదని తెలిపారు. మేల్పూరు చెరువుకు నీరు వచ్చే వరవ కాలువల్లో మొక్కలు తొలగించి మొక్కుబడి అభివృద్ధి పనులు చేట్టారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఉన్నతాదికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని చెరువు కట్టలను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్వీయూలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ బుధవారం పరిశీలించింది. రాజ్యాంగ బద్ధత కలిగిన, శాసనసభ, శాసనమండలి సభ్యులతో కూడిన ఈ కమిటీ రాష్ట్రంలో తొలిసారి ఎస్వీయూను పరిశీలించింది. భారత ప్రభుత్వం కాగ్ నివేదికను సమీక్ష చేసింది. భారాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అధ్యక్షులు పి. రామాంజనేయులుతో కమిటీ సభ్యులైన ఎన్. ఆనందబాబు, ఎ.రాధాకృష్ణ, ఎం.అశోక్ కుమార్ రెడ్డి, బి.రామాంజనేయులు, బి.జయనాగేశ్వర రెడ్డి, కె.లలిత కుమారి, శ్రీరామ్ రాజగోపాల్, పి. విష్ణుకుమార్ రాజులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్ హాల్లో సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయం కాగ్ వారికి కు ఇచ్చిన సమాధానాలను ఒక్కొక్కటి విశ్వవిద్యాలయ అధికారులను అడిగి కమిటీ సభ్యులు తెలుసుకున్నారు. ఆశావహ సమాధానాలతో కమిటీ సంతృప్తి చెందింది.

ప్రాచ్యపరిశోధనసంస్థను సందర్శించిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ బృందం

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పి. రామాంజనేయులు, నక్కా ఆనందబాబు, పి. విష్ణుకుమార్ రాజు, బి.రామాంజనేయులు బుధవారం రోజు సాయంత్రం సందర్శించారు. సంస్థలో భద్రపరచబడిన ప్రాచీన రాతప్రతులను చూసి ఆశ్చర్యంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలో ఈ తాళపత్రాల గొప్పదనాన్ని తెలుసుకునే వీడియో రూపొందించాలని సంచాలకులకు సూచించారు.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌కి విద్యార్థి సంఘాల విన్నపం

తిరుపతిలోని ఎస్వియూని సందర్శించిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ రామాంజనేయులుకి విద్యార్థి సంఘాలైన వైయస్ఆర్ సిపి, పిడిఎస్యు, ఎపివిహెచ్ఎస్, ఎన్ఎస్ఎస్ఎఫ్ నేతలు విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. వినతి సమర్పించిన వారిలో వైయస్సార్ విద్యార్థి విభాగం ఎస్వి యూనివర్సిటీ అధ్యక్షులు మన్నం ప్రేమ్ కుమార్, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి హెచ్.లోకేష్, ఆంధ్రప్రదేశ్ విద్యార్థి హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ముని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి -వరదయ్యపాలెం: గ్రామాల అభివృద్ధిలో పంచాయితీల కార్యదర్శి, వీఆర్ఓల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం వరదయ్యపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయితీల కార్యదర్శి, వీఆర్ఓ లతో పాటు అన్నీ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు పై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి దృష్టి సారించినట్లు స్పష్టం చేశారు. అందుకు అధికారుల సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని కోరారు.

కుట్టు శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి



ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండలంలో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఈటిఐ, సర్ఫ్ డిఆర్డిఏ పర్యవేక్షణలో ఏర్పాటైన టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని తహశీల్దారు ఎం.భార్గవి బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మండల టిడిపి అధ్యక్షులు నాగరాజు నాయుడు మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి బ్యాంకుల ద్వారా ఋణాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడుగు బాల గురునాథం యాదవ్, కృష్ణవేణి, ఆర్ఎస్ఈటిఐ డైరెక్టర్స్, ఏపిఎం ఆదినారాయణ, సీసీలు పాల్గొన్నారు.

నాణ్యమైన మార్బల్స్ ఏజిఎల్ షోరూంలో లభ్యం



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: నాణ్యమైన మార్బల్స్ అండ్ టైల్స్ తిరుపతి ఏజియల్ షోరూమ్ లో లభ్యమవుతాయని ఆ సంస్థ తిరుపతి బ్రాంచ్ అధినేతలు పొత్తూరు మారుతి నాయుడు, దేవేంద్ర నాయుడు తెలిపారు. దేశంలోని ప్రముఖ టైల్స్ అండ్ మార్బల్స్ కంపెనీ అయిన ఏజీఎల్ ఆర్ సి రోడ్డులోని తిరుపతి రూరల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేసిన బ్రాంచ్ వద్ద వారు బుధవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ నేటి ఈ పోటీ ప్రపంచంలో గృహోపకరాలంకరణలో సరికొత్త హంగుల కోసం ప్రతి ఒక్కరు ఆసక్తి చూపుతారు. వారి అభిరుచులను దృష్టిలో ఉంచుకొని ఏజీఎల్ సంస్థ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా, నేటి తరాన్ని అభిరుచులను దృష్టిలో ఉంచుకొని తమ వద్ద టైల్స్, మార్బల్స్, క్వార్ట్జ్, బాత్ వేర్ బ్రాండ్ అందుబాటులో ఉన్నాయన్నారు. భారతదేశమంతా 235 పైగా ఎక్స్క్లూ షోరూమ్స్ తో, 1400 పైగా డిజైన్లు ఒకే చోట లభ్యం అవుతాయని, 100 దేశాలకు పైగా గ్లోబలైజేషన్, 14 వేలకు పైగా సరికొత్త మోడల్స్తో సరసమైన ధరలకు, నాణ్యత, మన్నిక గల టైల్స్, మార్బల్స్ అందుబాటులో ఉంచుతున్నామన్నారు. దేశంలోనే ప్రముఖమైన ఏజీఎల్ సంస్థ అన్ని సైజులు, పలు రకాలు కలిగిన టైల్స్, మార్బల్స్, ఇత రాత్రవి తిరుపతి షో రూమ్ లో అందుబాటులో ఉంచడం శుభపరిణామం అన్నారు. దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు7893538663, 90527 30055.

సూపర్ జీఎస్టీపై అవగాహన



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పిల్లారిపట్టు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ భాగంగా విద్యార్థుల కోసం జీఎస్టీ 2.0 సంస్కరణలపై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వి కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి, డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ చెన్నా రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో కమీషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాలతో "సూపర్ జిఎస్ టీ సూపర్ సేవింగ్స్ " కార్యక్రమంపై ప్రజలకు అవేర్నెస్ క్యాంపైన్ నిర్వహించారు. ఆసుపత్రి ఆర్ ఎంఓ డాక్టర్ రామ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీల దేవి ముఖ్యఅతిథిగా విచ్చేసి "సూపర్ జిఎస్ టీ సూపర్ సేవింగ్ "కార్యక్రమం పై పేషెంట్ అటెండర్స్కు అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జన విజ్ఞాన జాగృతి సంస్థ డిస్ట్రిక్ట్ సెక్రటరీ రెడ్డప్ప గారు జిఎస్టీ 2.0 వల్ల విద్యార్థులకు మరియు వారి కుటుంబాలకు లభించే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ పి.నాగేంద్ర, ఎం.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో బుధవారం జి ఎస్ టి 2.0 సంస్కరణలపై విద్యార్థులకు అవగాహన సదస్సును ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన తిరుపతి తెల్లాకుల వంశీ అసోసియేట్స్ చార్టెడ్ అకౌంటెంట్ తెల్లాకుల వంశీ కృష్ణ మాట్లాడుతూ, నూతన జి ఎస్ టి 2.0 సంస్కరణలు తక్షణ లాభాలకంటే వినియోగదారులకు రాబోయే రోజుల్లో మరింత లాభదాయకంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పుషేంద్ర, అర్థశాస్త్ర అధ్యాపకులు, కోలా కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరుల పెంపుపై అవగాహన

ప్రజాశక్తి శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం పంచాయతీలో సొంతంగా ఆదాయ వనరులు ఎలా పెంచుకోవాలి అనే అంశంపై పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు, ఇంజనీర్లు, డిజిటల్ ఇంజనీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల కార్యాలయ ఏ.వో రవీంద్రనాథ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధుల మీద అలాగే, ఇంటి పన్నుల ద్వారా వచ్చే ఆదాయాల మీదే ఆధారపడకుండా పన్నేతర ఆదాయాలు అయిన చేపల చెరువులు, ట్రేడ్ లైసెన్స్, భవనాలకు అనుమతులు, సెల్ టవర్లు, సంతలు వంటి వాటి ద్వారా ఆదాయం సమీకరించి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, కారాకొల్లు పంచాయతీ కార్యదర్శి వినోద్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై రెండు రోజులు అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సోషల్ వర్క్ విభాగం, సైకాలజీ విభాగం, మహిళా అధ్యయన కేంద్రం, సంయుక్త ఆధ్వర్యంలో పీఎం ఉషా ఆర్థిక సహకారంతో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని మహిళా విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కాలేజీలోని ద్రితి హాలులో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహిళా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమా మాట్లాడుతూ శారీరిక భావోద్వేగ సామాజిక మరియు ఆలోచన సామర్థ్యం మానసిక ఆరోగ్యానికి నాలుగు మూల స్తంభాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్, సైకాలజీ విభాగం మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్స్, సైన్సెస్ సోషల్ సైన్సెస్ హ్యుమానిటీస్ అండ్ మేనేజ్మెంట్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధునికమైన విజ్ఞానం అవసరం

ప్రజాశక్తి - క్యాంపస్ : పశుశాస్త్ర చికిత్సలలో ఆధునికమైన విజ్ఞానాన్ని అవసరం అని మాజీ విసి తిలగర్ పేర్కొన్నారు. కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్. తిలగర్, తమిళనాడు పశువైద్య విశ్వవిద్యాలయం, ప్రత్యేక అతిథిగా శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయము ఇంచార్జ్ ఉపకులపతి ప్రొఫెసర్ జె.వి.రమణ, గౌరవ అతిథిగా ప్రొఫెసర్ ప్రతాబన్, అధ్యక్షులు, ఇండియన్ సొసైటీ ఫర్ అడ్వాన్సుమెంటు ఆఫ్ కెనైన్ ప్రాక్టీస్ హాజరయ్యారు. ముఖ్య అతిధి ప్రొఫెసర్ తిలగర్ మాట్లాడుతూ పశువైద్యములో స్పెషలిలైజేషన్ చాల అవసరమని తెలిపారు. బేసిక్ సైన్సుతో సంబంధమైన పరిశోధనలు పశువైద్యంలో చాలా అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో సమావేశానికి 14 రాష్ట్రాల నుండి మరియు 25 పశువైద్య కళాశాలల నుండి 250 పశువైద్య విద్యార్థి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రహదారి



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి నుండి శ్రీనివాస మంగాపురం రోడ్డు మార్గంలో నేషనల్ హైవే ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గర గత ఆరు నెలలుగా రోడ్డు గుంతలమయమై వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఈరోడ్డులో ప్రతి నిత్యం యాత్రికులు, పరిసర గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు వారి వాహనాలలో వెళుతూ ఇబ్బంది పడుతున్నారు.వారి వాహనాలు కూడా మరమ్మతులకు గురవుతున్నాయి. ఈ గుంతలో వర్షం పడినపుడు వాహనదారులకు నీరు తప్ప గుంతలు కనిపించనందువల్ల ప్రమాదాలకు నిలయంగా మారింది. అధికారులు వెంటనే స్పందించి రోడ్డును మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంప్

ప్రజాశక్తి - రేణిగుంట : పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా రేణిగుంట మండల ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక ఆధార్ సెంటర్ ను జడ్పీ బాలికల హై స్కూల్‌లో బుధవారం ప్రారంభించారు. గురువారం కూడా ఈ ఆధార్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని రేణిగుంట ప్రజలు ఉపయోగించుకోవాల్సిందిగా పోస్టల్ సిబ్బంది కోరారు.

క్రైం న్యూస్

లారీ, బైక్ ఢీ.. ఇద్దరు మృతి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : లారీ, మోటారు సైకిల్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు తమిళనాడు, పొద్దుటూరుకు చెందిన మూర్తి గురునాథ్ (60) మరో వ్యక్తి బివి సుబ్రహ్మణ్యం (53) వీరిద్దరూ మోటార్ సైకిల్ పై కాళహస్తి ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా, తిరుపతి వైపు నుంచి చెన్నై వైపు వెళాఉతున్న లారీ పుత్తూరు బైపాస్ రోడ్డు వద్ద మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి మృత దేహాలను పరీక్ష నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రబీ విత్తన దినోత్సవం



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తన దినోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పరిశోధన సహసంచాలకులు డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ విత్తన దినోత్సవ కార్యక్రమము ఆవశ్యకతను రైతులకు వివరించారు. రబీలో వేసుకునే అన్ని ప్రధాన పంటలలో సమగ్ర కలుపు యాజమాన్య పద్ధతుల గురించి డాక్టర్ పి. మహేశ్వర్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులకు మినుములో టీబీజీ 104 , 129 అలసందలో టి. పి. టి. సి. 29 రకము, అనపలో టి. ఎఫ్. బి–2 , రాగిలో వకుల తిరుమల రకాల విత్తనాలను అందించారు.

శారదకి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఫార్మాస్యూటికల్ సైన్సెస్ పరిశోధన విద్యార్థిని ఎన్ శారదకి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. ఈమె అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.సుజాత మార్గదర్శకత్వంతో "ఎవాల్యూషన్ ఆఫ్ సెలెక్టెడ్ ఇండియన్ మెడిసినల్ ప్లాంట్స్ ఫర్ దైర్ అన్టి డయాబెటిక్ ఆక్టివిటీ విత్ ఇన్ విట్రో అన్డ్ ఇన్ వివో మెథడ్స్" అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. శారదకి డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆమెను అభినందించారు.

ఏహెచ్‌ను అభివృద్ధి చేస్తా : బొజ్జల



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మాక్స్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో రూ. 10 లక్షలు విలువ జేసే అధునాతన వైద్య పరికరాలను ఏరియా ఆసుపత్రికి అందజేశారు. పబ్లిక్ కార్పొరేట్ సహకారంలో భాగంగా మాక్స్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత బీవీవీఎస్ఎన్ రాజు ఆసుపత్రికి పెద్ద సాయం చేయడం అభినందనీయమన్నారు. ఇదే తరహాలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు సీఎస్ఆర్ ఫండ్స్ సాయంతో చేపడతామని హామీ ఇచ్చారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి కడప జిల్లా, వేంపల్లికి చెందిన దేవదుర్గం నాగభూషణం బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఏఈఓ మోహన్ కు అందించి నిత్యాన్నదానానికి ఖర్చు చేయాల్సిందిగా సూచించారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం కల్పించారు.